# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

మెదక్ | సంపుటి: 19 సంచిక : 57 | గురువారం 29, అక్టోబర్ 2025 | పేజీలు: 06 | వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamabad-Adilabad -Vijayawada-Guntur-Vizag-Kurnool | www.prajaswaramdaily.com



MHR TV


# ఇందిరమ్మకు ఇసుక ట్యాక్సీ

'మన ఇసుక వాహనం'యాప్‌తో అనుసంధానం
యాప్‌లో బుక్ చేస్తే ఇంటికే ఉచితంగా ఇసుక
రవాణా చార్జీలు అధికంగావసూలు చేయకుండా చర్యలు
గృహనిర్మాణ సంస్థ ఎండీ గౌతమ్ వెల్లడి




హైదరాబాద్, ప్రజాస్వరం

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఇసుక కోసం ఇబ్బందులు పడకుండా ఆన్‌లైన్‌లో బుక్ చేస్తే ఇంటికే ఇసుక వచ్చే విధానాన్ని గృహనిర్మాణ శాఖ సిద్ధం చేసింది. తెలంగాణ గనుల శాఖ కోసం సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ గతంలో రూపొందించిన 'మన ఇసుక వాహనం'యాప్‌ను ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అనుసంధానించారు. ఇందులో ఉన్న సాంకేతికపరమైన అవాంతరాలను గుర్తించి, దాన్ని మరింత మెరుగ్గా రూపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ యాప్‌లో ఆయా గ్రామాల్లోని ట్రాక్టర్ల వివరాలను అనుసంధానించారు. ఇందిరమ్మ లబ్ధిదారులు ఆ యాప్‌లో ఇసుక లోడ్ బుక్ చేసి, వాహన రవాణా చార్జీని ఆన్‌లైన్‌లో చెల్లించగానే, ఆ ఊరికి సంబంధించి యాప్‌లో ఉన్న వాహనం వెళ్లి ఇసుకను తెచ్చి లబ్ధిదారుకు అందిస్తుంది. ఇందిరమ్మ పథకం కింద లబ్ధిదారులకు ఇసుకను ఉచితంగా ఇవ్వాలని ప్రభుత్వం గతంలోనే నిర్ణయించింది. కేవలం ఇసుక రీచ్/ఇసుక బజార్/ఇసుక డంప్ నుంచి ఇసుకను తరలించే ట్రాక్టర్‌కు రవాణా ఖర్చులు చెల్లిస్తే సరిపోతుంది. ట్రాక్టర్ యజమానులు తోచినంత డిమాండ్ చేసే వీలు లేకుండా రవాణా చార్జీలను కూడా అధికారులే ఖరారు చేసి యాప్‌లో నిక్షిప్తం చేశారు. ఇసుక బుక్ చేసుకున్న లబ్ధిదారు ఇల్లు ఇసుక బజార్ నుంచి ఎంత దూరం ఉందో... దానికి తగ్గ చార్జీ ఆటోమేటిక్‌గా యాప్‌లో తెలుస్తుంది. ఆ మొత్తాన్ని చెల్లించి ఇసుక పొందే ఏర్పాటు చేస్తున్నట్టు గృహనిర్మాణ సంస్థ ఎండీ గౌతమ్ తెలిపారు. ఇసుక పక్కదారి పట్టకుండా లబ్ధిదారు బుక్ చేయగానే

...మిగతా 2లో



# ఎనమిది జిల్లాలకు రెడ్ అలర్ట్

## మొంథా తుఫాన్ ప్రభావంతో తెలంగాణలో కుండపోత వర్షాలు

విధ్వంసం సృష్టించిన మొంథా తుఫాన్..
వరంగల్ నగర వీధుల్లో వరద నీరు, రవాణా అంతరాయం
ఆరు జిల్లాలకు వాతావరణశాఖ రెడ్ అలర్ట్
ఖమ్మం-మహబూబాబాద్ రహదారి తాత్కాలికంగా మూసివేత
భారీ సంఖ్యలో రైళ్లు రద్దు చేసిన రైల్వే శాఖ..
ఏపీ, తెలంగాణలోని ప్రధాని రైల్వే స్టేషన్లలో హెల్ప్ డెస్కులు..
25 రైల్వే స్టేషన్లలో హెల్ప్ లైన్ ఏర్పాటు

హైదరాబాద్, ప్రజాస్వరం

మొంథా తుఫాన్ ప్రభావంతో తెలంగాణలోని అనేక జిల్లాల్లో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. భారీ వర్షాల కారణంగా వరంగల్-ఖమ్మం ప్రధాన రహదారి మీదుగా వరద నీరు భారీగా చేరింది. ప్రధాన రహదారిపై నీరు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని పోలీసులు ఆ రహదారిని తాత్కాలికంగా మూసివేశారు.వరంగల్ నగరంలోని శివనగర్, మైసయ్య నగర్, ఎన్ఎన్ నగర్, లక్ష్మీగణపతి కాలనీ, విశ్వనాథ్ కాలనీ, కాశీబుగ్గ, వివేకానంద కాలనీ, స్టేషన్ రోడ్, బట్టలబజార్ ప్రాంతాల్లో రోడ్లపైకి వరద నీరు చేరింది. రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద భారీగా నీరు నిలిచిపోవడంతో వాహన రాకపోకలు కష్టంగా మారాయి. ముఖ్యంగా శివనగర్ ప్రాంతంలో రహదారిపై నీరు నిలిచి ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వరంగల్ బస్టాండ్

...మిగతా 2లో



# బీసీల జీవితాలతో చెలగాటమొద్దు

ఐక్యత లేకపోవడం వల్లే ఇతరులకు అధికారం
ఇక ఇది ఎన్నో రోజులు నడవదు
బీసీల్లో చైతన్యం వచ్చింది
రాజ్యాధికారం వచ్చేంతవరకు ఇది ఆగదు
మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

హైదరాబాద్, ప్రజాస్వరం

బీసీల్లో ఐక్యత లేకపోవడం వల్లే ఒకరిని దించి మరొకరిని అధికారంలో కూర్చోబెడుతున్నామని, దానికి మాత్రమే బీసీలు పనికి వస్తున్నారని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ వ్యాఖ్యానించారు. రవీంద్ర భారతిలో తెలంగాణ సగర సంఘం ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవాన్ని

...మిగతా 2లో

# ఓవర్సీస్ స్కాలర్‌షిప్ 303 కోట్లు విడుదల

ఓవర్సీస్ స్కాలర్షిప్ 303 కోట్లు వెంటనే విడుదల చేయండి
2022 నుంచి నేటి వరకు మొత్తం బకాయిలు క్లియర్ చేయండి
డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ఆదేశం




## అజారుద్దీన్‌కు మంత్రి పదవి... రేపు ప్రమాణ స్వీకారం?

మంత్రి వర్గ విస్తరణకు అధిష్ఠానం నుంచి అనుమతి!
ఎమ్మెల్సీగా నామినేట్ చేసిన తెలంగాణ ప్రభుత్వం
ఇంకా ఆమోదం తెలపని గవర్నర్
మంత్రిగా ప్రమాణ స్వీకారానికి ఏఐసీసీ ఆమోదం!




## ప్రాణ, ఆస్తి నష్టం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

రైతులకు నష్టం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచన
మొంథా ప్రభావం అధికంగా ఉన్న జిల్లాలల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్న సీఎం
ఫిర్యాదులపై హైడ్రా, జీహెచ్ఎంసీ వెంటనే స్పందించాలన్న ముఖ్యమంత్రి

మొంథా తుపాను తీవ్ర వాయుగుండంగా మారి రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని

...మిగతా 2లో



# దండుపాళ్యం బ్యాచ్ అంటే దంచికొడతాం

బోరబండ డివిజన్‌లో సీతక్క విస్తృత ప్రచారం
బీఆర్ఎస్ అబద్ధపు ప్రచారంపై సీతక్క తీవ్ర స్థాయిలో స్పందన
నవీన్ యాదవ్ పక్కా లోకల్ నేత అని సీతక్క స్పష్టం




## ఓట్లు వేస్తామంటే మోదీ డ్యాన్స్ కూడా చేస్తారు

మోదీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డ రాహుల్
ఓట్ల కోసం మోదీ ఏమైనా చేస్తారని విమర్శ
ఛఠ్ పూజ సమయంలో మోదీ స్విమ్మింగ్ పూల్‌లో స్నానం చేశారని ఆరోపణ
పారిశ్రామికవేత్తల కోసమే మోదీ పనిచేస్తున్నారని ఫైర్
దేశవ్యాప్తంగా కులగణన చేపడతామని హామీ
బీహార్‌లో డబుల్ ఇంజన్ ప్రభుత్వాన్ని కూల్చాలని పిలుపు





# ఇందిరమ్మకు ఇసుక ట్యాక్సీ

**మొదటిపేజీ తరువాయి**



వన్‌టైం బార్ కోడ్ జనరేట్ అవుతుంది. దాన్ని స్కాన్ చేస్తేనే ఇసుక తరలింపు సాధ్యమవుతుందని, ఇది అక్రమాలకు కళ్లెం వేస్తుందని ఆయన తెలిపారు. మంగళవారం గృహనిర్మాణ సంస్థ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వివరాలు తెలిపారు. ఇసుక రీచ్‌లు దూరంగా ఉండే ప్రాంతాల్లో ఇసుక బజార్‌లు ఏర్పాటు చేసి ఇసుకను అందుబాటులో ఉంచుతున్నట్టు వెల్లడించారు.

**నిబంధనల మేరకే కట్టాలి..**

ఇందిరమ్మ ఇళ్ల విస్తీర్ణం 400 చ.అ.కు తగ్గకుండా, 600 చ.అ.కు పెరగకుండా ఉండేలా నిబంధన విధించామని, మేస్త్రీలు కూడా ఇంటి పైకప్పును అదే విస్తీర్ణంలో నిర్మించాలని గౌతమ్ సూచించారు. కొందరు పైకప్పును ఎక్కువ విస్తీర్ణంలో నిర్మించి ఎక్కవ చార్జీలు డిమాండ్ చేస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందని, అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హైదరాబాద్ నగరంలో గతంలో డబుల్ బెడ్‌రూమ్ పథకంలో భాగంగా నిర్మించిన కాలనీలు కొన్ని ఖాళీగా ఉన్నాయని, వాటిని లబ్ధిదారులకు అలాట్ చేసినా అక్కడ ప్రభుత్వ పాఠశాలలు లేక వెళ్లటం లేదని తెలిపారు. అలాంటి చోట్ల బడులు ఏర్పాటు చేస్తున్నారని, త్వరలో లబ్ధిదారులు వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ఆర్థిక ఇబ్బందులతో ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించుకోని లబ్ధిదారులకు ఇళ్ల మంజూరీని రద్దు చేయబోమని హామీ ఇచ్చారు. అలాంటి వారు స్వయంసహాయక బృందాల్లో ఉంటే రుణాలు మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. ఇప్పటి వరకు 22 వేల మందికి రూ.236 కోట్లు మంజూరు చేసినట్టు వెల్లడించారు. జన్‌ధన్ ఖాతాలు, తపాలా శాఖ ఖాతాల నగదు నిల్వపై పరిమితి ఉన్నందున ఇందిరమ్మ బిల్లుల చెల్లింపులో సమస్యలు వస్తున్నాయని, వారు బ్యాంకులను సంప్రదించి సమస్య పరిష్కరించుకోవాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 2.25 లక్షల ఇళ్ల నిర్మాణం ప్రారంభమైందని, లబ్ధిదారులకు ఇప్పటివరకు రూ.2,526.12 కోట్లు చెల్లించినట్టు వివరించారు. కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ చైతన్య కుమార్, సీనియర్ కన్సల్టెంట్ ఈశ్వరయ్య, జీఎంలు శ్రీదేవి, మమత తదితరులు పాల్గొన్నారు.

# దండుపాళ్యం బ్యాచ్ అంటే దంచికొడతాం

- **బోరబండ డివిజన్‌లో సీతక్క విస్తృత ప్రచారం**
- **బీఆర్ఎస్ అబద్ధపు ప్రచారంపై సీతక్క తీవ్ర స్థాయిలో స్పందన**
- **నవీన్ యాదవ్ పక్కా లోకల్ నేత అని సీతక్క స్పష్టం**

**హైదరాబాద్, ప్రజాస్వరం**



జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఎన్నికల వేడి రోజురోజుకూ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో మంత్రి సీతక్క ప్రచారాన్ని మరింత ఉధృతం చేశారు. ఆమెకు అప్పగించిన బోరబండ డివిజన్‌లో మంగళవారం పర్యటిస్తూ ప్రజలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బీఆర్ఎస్ అబద్ధపు ప్రచారానికి తెరదించాల్సిన సమయం వచ్చిందని సీతక్క వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ పాలనలో ఉన్న రౌడీ షీటర్లు ఇప్పుడు మంచివాళ్లుగా మారిపోయారా? అని ఆమె ప్రశ్నించారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ పై పదే పదే రౌడీ షీటర్ అన్న ముద్ర వేయడం సరికాదని ఆమె స్పష్టం చేశారు. నవీన్ యాదవ్ పక్కా లోకల్ నాయకుడు, ఆయన గెలుపును ఎవ్వరూ ఆపలేరని ఆమె వ్యాఖ్యానించారు.

"పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఏమి సాధించలేకపోయారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం రెండేళ్లలోనే ప్రజల జీవితాల్లో మార్పు తీసుకువచ్చింది. ఇకపై మా కేబినెట్‌ను 'దండుపాళ్యం బ్యాచ్' అని పిలిస్తే ఊరుకోం.. గట్టిగా సమాధానం ఇస్తాం" అని సీతక్క హెచ్చరించారు. ఇక మరోవైపు, జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో అధికార కాంగ్రెస్ పార్టీ ప్రచారాన్ని పూర్తి స్థాయిలో వేగవంతం చేసింది. నియోజకవర్గంలోని డివిజన్ల వారీగా మంత్రులు, ముఖ్య నేతలకు బాధ్యతలు అప్పగించగా, వారు పాదయాత్రలు, ఇంటింటి ప్రచారాల ద్వారా ప్రభుత్వ అభివృద్ధి పనులను ప్రజలకు వివరించనున్నారు.

# ఆరు జిల్లాలకు రెడ్ అలర్ట్






**మొదటిపేజీ తరువాయి**

పరిసరాలు చెరువును తలపించే స్థితికి చేరాయి.

భారీ వర్షాల నేపథ్యంలో హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. సహాయక చర్యల కోసం ప్రజలు 79819 75495 నంబర్ ద్వారా సంప్రదించాలని అధికారులు సూచించారు. వరంగల్ జిల్లాలోని కల్లెడ్ ప్రాంతంలో అత్యధికంగా 34 సెం.మీ. వర్షపాతం నమోదైంది. వాతావరణ శాఖ తాజా హెచ్చరికల ప్రకారం హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. అదనంగా, ఆదిలాబాద్, నిర్మల్, సూర్యాపేట, జగిత్యాల, మంచిర్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు ప్రకటించబడ్డాయి. ఖమ్మం-మహబూబాబాద్ జిల్లాల మధ్య ఉన్న వాల్యాతండా సమీప వంతెన వద్ద ఆకేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. వరద తీవ్రత పెరగడంతో అధికారులు రెండు జిల్లాల మధ్య రాకపోకలను సాయంత్రం నుంచి నిలిపివేశారు. ప్రస్తుతం పలు జిల్లాల్లో వరద పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, అవసరం లేని ప్రయాణాలను నివారించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

తీరం దాటిన మొంథా తుఫాన్ ఎఫెక్ట్‌తో తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి.. తీర ప్రాంతాల జిల్లాలో విధ్వంసం సృష్టించిన మొంథా.. మిగతా జిల్లాల్లోనూ తీవ్ర పంట నష్టాన్ని మిగిల్చింది.. ఇక, తుఫాన్ ప్రభావంతో.. ఈస్ట్ కోస్ట్, సౌత్ సెంట్రల్ రైల్వే పరిధిలో పెద్ద సంఖ్యలో రైళ్లను పూర్తిగా రద్దు చేయాల్సిన పరిస్థితి.. కొన్ని రైళ్లను దారి మళ్లించగా.. కోస్తా ప్రాంతాలు.. విజయవాడ మీదుగా నడవాల్సిన చాలా రైళ్లను రద్దు చేశారు.. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని ప్రధాని రైల్వే స్టేషన్లలో హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేసింది

# అజారుద్దీన్‌కు మంత్రి పదవి... రేపు ప్రమాణ స్వీకారం?

- **మంత్రి వర్గ విస్తరణకు అధిష్ఠానం నుంచి అనుమతి!**
- **ఎమ్మెల్సీగా నామినేట్ చేసిన తెలంగాణ ప్రభుత్వం**
- **ఇంకా ఆమోదం తెలపని గవర్నర్**
- **అయినప్పటికీ మంత్రిగా ప్రమాణ స్వీకారానికి ఏఐసీసీ ఆమోదం!**

**హైదరాబాద్, ప్రజాస్వరం**

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ క్రికెటర్ మహమ్మద్ అజారుద్దీన్‌కు మంత్రి పదవి లభించినట్టు తెలుస్తోంది. రేపు తెలంగాణ మంత్రివర్గ విస్తరణ జరగనుందని, ఆయన మంత్రిగా ప్రమాణం చేస్తారని కాంగ్రెస్ పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. మంత్రివర్గ విస్తరణకు పార్టీ అధిష్ఠానం నుంచి అనుమతి లభించినట్లు సమాచారం. తెలంగాణ మంత్రివర్గంలో 18 మందికి అవకాశం ఉండగా, ప్రస్తుతం 15 మంది మంత్రులు ఉన్నారు. మరో ముగ్గురికి అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో మైనార్టీ వర్గానికి చెందిన అజారుద్దీన్‌కు మంత్రిగా అవకాశం కల్పించినట్లు తెలుస్తోంది. మంత్రివర్గంలో ముస్లిం మైనార్టీలకు ప్రాధాన్యం కల్పించాలని కాంగ్రెస్ అధిష్ఠానం భావిస్తోంది. అజారుద్దీన్ గత అసెంబ్లీ ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నుంచి కాంగ్రెస్ తరపున పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ప్రస్తుత ఉప ఎన్నికల్లోనూ పోటీ చేసేందుకు ఆసక్తి చూపినప్పటికీ, ఆయనకు ఎమ్మెల్సీ పదవిని ఇవ్వాలని కాంగ్రెస్ నిర్ణయించింది. గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీలుగా అజారుద్దీన్, కోదండరాంల పేర్లను ఎంపిక చేసి, గవర్నర్ ఆమోదం కోసం పంపింది. గవర్నర్ ఇంకా ఆమోదం తెలపాల్సి ఉంది. అయినప్పటికీ అజారుద్దీన్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడానికి ఏఐసీసీ ఆమోదం తెలిపినట్లు సమాచారం.





# ప్రాణ, ఆస్తి నష్టం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

**మొదటిపేజీ తరువాయి**



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. వాయుగుండం ప్రభావంపై ముఖ్యమంత్రి అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకుని, వారికి దిశానిర్దేశం చేశారు. వరి కోతల సమయం కావడంతో పాటు పలు చోట్ల కళ్లాల్లో ధాన్యం ఆరబోసిన నేపథ్యంలో రైతులకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాల్లోనూ తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ఉమ్మడి ఖమ్మం, ఉమ్మడి వరంగల్, ఉమ్మడి నల్గొండ జిల్లాల్లో మొంథా తుపాను ప్రభావం అధికంగా ఉండగా, హైదరాబాద్ సహా ఇతర జిల్లాల్లోనూ భారీ వర్షాలు కురుస్తుండడంతో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ జంక్షన్‌లో గోల్కొండ ఎక్స్‌ప్రెస్, గుండ్రాతిమడుగు స్టేషన్‌లో కోణార్క్ ఎక్స్‌ప్రెస్ నిలిచిపోవడంతో పలు రైళ్లను దక్షిణ మధ్య రైల్వే అధికారులు దారిమళ్లించిన నేపథ్యంలో ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. తుపాను ప్రభావం అధికంగా ఉన్న జిల్లాల్లో ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సమన్వయంతో పనిచేయాలని, జిల్లా కలెక్టర్లు ఆయా బృందాలకు తగిన మార్గదర్శకత్వం వహించాలని సూచించారు. వాగులు, వంకలు పొంగే ప్రమాదం ఉన్నందున జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండి, లోతట్టు ప్రాంతాల కుటుంబాలను సహాయక శిబిరాలకు తరలించాలన్నారు. నీటి పారుదల శాఖ అధికారులు, సిబ్బంది రిజర్వాయర్లు, చెరువులు, కుంటల నీటి మట్టాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, నీటి విడుదలపై ముందుగానే కలెక్టర్లకు మరియు క్షేత్రస్థాయి సిబ్బందికి సమాచారం ఇవ్వాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. పూర్తిగా నిండిన చెరువులు, రిజర్వాయర్ల వద్ద ఇసుక బస్తాలను ముందుగానే సిద్ధంగా ఉంచాలన్నారు.

రోడ్లపై నీరు నిలిచిన ప్రాంతాల్లో, లో లెవల్ బ్రిడ్జీలు, కాజ్‌వేలపై నుంచి రాకపోకలను పూర్తిగా నిషేధించాలని, పోలీసులు, రెవెన్యూ అధికారులు వాటి సమీపంలో బారికేడ్లు ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. తుపాను ప్రభావంతో వర్షపు నీరు నిలువ ఉండి దోమలు, ఇతర క్రిమికీటకాలు విజృంభించే అవకాశం ఉన్నందున నగర, పురపాలక, గ్రామ పారిశుధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలని ముఖ్యమంత్రి గారు చెప్పారు. వైద్యారోగ్య శాఖ తగినంత మందులను అందుబాటులో ఉంచుకోవాలని, అవసరమైన చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రాణనష్టం, ఆస్తినష్టం, పశునష్టం చోటుచేసుకోకుండా శాఖలు జాగ్రత్తలు వహించాలన్నారు. రెవెన్యూ, విద్యుత్, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ, వైద్యారోగ్య, పోలీస్, అగ్నిమాపక శాఖలు, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది సమన్వయంతో పని చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. హైదరాబాద్ నగరంలో ప్రజల నుంచి వచ్చే వినతులకు జీహెచ్ఎంసీ, హైడ్రా, ఎస్డీఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖ సిబ్బంది తక్షణమే స్పందించాలని ఆదేశించారు.

# ఓవర్సీస్ స్కాలర్షిప్ 303 కోట్లు విడుదల

- **2022 నుంచి నేటి వరకు మొత్తం బకాయిలు క్లియర్ చేయండి**
- **డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ఆదేశం**

**హైదరాబాద్, ప్రజాస్వరం**

పెండింగ్ లో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసి, మైనారిటీ విద్యార్థుల ఓవర్సీ స్కాలర్షిప్ బకాయిలు 303 కోట్ల రూపాయలు వెంటనే విడుదల చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించారు. 2022 నుంచి పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ మొత్తాన్ని ఒకేసారి క్లియర్ చేయాలని ఆదేశించారు.

నిరాశ, నిస్పృహల్లో ఉన్న వేల కుటుంబాల్లో డిప్యూటీ సీఎం ఆదేశాలు ఆనందం నింపింది. ఆర్థిక స్తోమత లేకపోయినప్పటికీ విదేశాల్లో ఉన్నత చదువులు చదివి, ఉద్యోగాలు సాధించి ఆర్థికంగా ఉన్నత స్థితికి ఎదగాలని ఆలోచనతో వేలాది మంది పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలు ఓవర్సీస్ స్కాలర్షిప్ పై విదేశాలకు వెళ్లారు. గత ప్రభుత్వ కాలం నుంచి ఓవర్సీస్ స్కాలర్షిప్ అందకపోవడంతో విదేశాల్లో ఉన్న విద్యార్థులు, రాష్ట్రంలో ఉన్న తల్లిదండ్రులు మానసికంగా ఇబ్బంది పడుతున్నారు. ఓవైపు ఓవర్సీస్ స్కాలర్షిప్ అందక మరోవైపు అమెరికా, యూకే వంటి దేశంలో కొత్త కొత్త ఆంక్షలతో విద్యార్థులపై మానసిక ఒత్తిడి తీవ్రమైంది. ఆయా దేశాల్లో గతంలో మాదిరిగా చదువుకుంటూ ఉద్యోగాలు చేసుకునే పరిస్థితి లేదు. అక్కడ రోజురోజుకు ఆర్థిక భారం పెరిగిపోతుంది. మరోవైపు బ్యాంకుల్లో తీసుకున్న ఎడ్యుకేషన్ లోన్ భారం పెరుగుతుంది. ఈ పరిస్థితిలన్నిటిని అవగాహన చేసుకున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ఈ సమస్యను ప్రాధాన్యత అంశంగా భావించి ఓవర్సీస్ స్కాలర్షిప్ మొత్తాన్ని ఒకేసారి క్లియర్ చేయాలని ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించారు. తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న సమయంలో డిప్యూటీ సీఎం ఆదేశాలతో వేలాది కుటుంబాల్లో కొత్త ఆశలు చిగురించాయి. కష్టకాలంలో ప్రభుత్వం ప్రతి విద్యార్థి సుమారు 20 లక్షల ఆర్థిక సహాయం అందించడంతో తమ బిడ్డలు అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటారని, తమ ఇబ్బందులు తొలగిపోతాయని హర్షం వ్యక్తం చేస్తున్నారు. కష్టకాలంలో ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయంతో అనుకున్న లక్ష్యాన్ని సాధించి రాష్ట్రానికి, దేశానికి తిరిగి అర్థవంతమైన సేవలు అందించే అవకాశం కలుగుతుందని ఆశాభావంతో ఉన్నట్టు ఓవర్సీస్ విద్యార్థులు తెలిపారు.

# బీసీల జీవితాలతో చెలగాటమొద్దు

**మొదటిపేజీ తరువాయి**

బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఈటల ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇక ఇది ఎన్నో రోజులు నడవబోదని, బీసీల్లో చైతన్యం వచ్చిందని, రాజ్యాధికారం వచ్చేంత వరకు ఇది ఆగదని పేర్కొన్నారు. జెండాలు, ఎజెండాలు లేకుండా రాష్ట్ర సాధన ఎజెండా కోసం అన్ని రాజకీయ పార్టీలు, సంఘాలు పనిచేశాయని తెలిపారు. బీసీ రిజర్వేషన్ల సాధన ఏకైక అజెండాగా అన్ని పార్టీలను ఏకం చేసే రాజకీయ వేదికను తయారు చేయాలని కోరారు. బ్రాహ్మణ, వైశ్య లాంటి ఒకటి రెండు కులాలు మాత్రమే దేశమంతా ఒకటే కులంగా కొనసాగుతున్నాయని, కొన్ని కులాలు మన రాష్ట్రంలో బీసీలైతే మరో రాష్ట్రంలో ఎస్సీ కులాల కిందికి వస్తున్నాయన్నారు. కేంద్రం జన గణన చేస్తానని ప్రకటించిందని, దేశవ్యాప్తంగా జన గణన జరగాల్సిందేనన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీల జీవితాలతో చెలగాటమాడవద్దని హెచ్చరించారు. మోసం చేయాలని చూస్తే అదే ఉచ్చులో చిక్కుకుని గిలగిలలాడక తప్పదని హెచ్చరించారు. సమయం వచ్చినప్పుడు ప్రజలు కర్రు కాల్చి వాత పెడతారని విమర్శించారు.





# పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగకు సన్మానం

- ఖమ్మం ప్రెస్ క్లబ్ కమిటీ ఆధ్వర్యంలో మందకృష్ణ మాదిగకు ఘన సన్మానం

**ఖమ్మం,అక్టోబర్ 29 (ప్రజాస్వరం):**

మాదిగ సామాజిక ఉద్యమ నేత మందకృష్ణ మాదిగ కు ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక పద్మశ్రీ అవార్డును అందజేసింది. మూడు దశాబ్దాల పాటు మాదిగ సామాజిక వర్గ ఉద్యమాన్ని విజయవంతంగా కొనసాగించి రిజర్వేషన్లను దక్కించుకున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డుకు మందకృష్ణ మాదిగకు అందజేసిన విషయం విదితమే... కాగా మందకృష్ణ మాదిగ బుధవారం ఖమ్మం పర్యటనకు వచ్చారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి ఆధ్వర్యంలో ఖమ్మం ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జర్నలిస్టులు ఘనంగా మందకృష్ణ మాదిగను శాలువా కప్పి పుష్పగుచ్చాలతో ఘనంగా సన్మానం చేశారు. పద్మశ్రీ అవార్డు అందుకున్న అనంతరం ఖమ్మం ప్రెస్ క్లబ్ కు విచ్చేసిన సందర్భంగా మందకృష్ణ మాదిగను ప్రెస్ క్లబ్ కమిటీ ఆధ్వర్యంలో జర్నలిస్టులు ఘనంగా సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు, ప్రధాన కార్యదర్శి కొరకొప్పుల రాంబాబు,కోశాధికారి బిక్కి గోపి,జర్నలిస్టు యూనియన్ ఉపాధ్యక్షులు మందుల ఉపేందర్, చెరుకుపల్లి శ్రీనివాస్,సాయి, ఇసంపల్లి వెంకటేశ్వర్లు, పానకాలరావు, పెంటి వెంకటేశ్వర్లు, రామారావు,ఎస్ డి యాదగిరి, మంద వెంకటేశ్వర్లు,పూర్ణ, ఉపేందర్,సాయి,హుస్సేన్,నరేష్, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ప్రభుత్వ పాఠశాలల్లో ఇకపై కట్టెల వంటకు స్వస్తి

- మధ్యాహ్న భోజనం కోసం గ్యాస్ సిలిండర్ల ద్వారానే వంట చేయాలి.
- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశాలు.

**వనపర్తి,అక్టోబర్ 29 (ప్రజాస్వరం):**

జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఇకపై మధ్యాహ్న భోజన వంటలు కట్టెలతో కాకుండా గ్యాస్ సిలిండర్ ద్వారా మాత్రమే చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో విద్యాశాఖ అధికారులతో సమావేశం నిర్వహించి పలు అంశాలపై సమీక్ష చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ— "పాఠశాలల్లో కట్టెల వంట పద్ధతికి పూర్తిగా స్వస్తి చెప్పాలి. ప్రతి పాఠశాలకు ఎల్పీజీ కనెక్షన్ ఉండేలా చూడాలి. రాబోయే ఒక నెలలో కనెక్షన్ల ప్రక్రియ పూర్తవ్వాలి," అని అధికారులను ఆదేశించారు. మండల విద్యాశాఖ అధికారులు, క్లస్టర్ హెడ్మాస్టర్లు ప్రతిరోజూ పాఠశాలల సందర్శనలు చేయాలని, అక్టోబర్ నెలలో నిర్దేశించిన విజిట్ ల లక్ష్యాలను రాబోయే రెండు రోజుల్లో పూర్తి చేయాలని సూచించారు. అపార్ ఐడీ జనరేషన్ ప్రక్రియలో ఇప్పటికే మెరుగుదల కనిపిస్తున్నదని, అయితే మొత్తం విద్యార్థులకు శీఘ్రంగా పూర్తి చేయాలని సూచించారు. గణితంలో వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు నిర్వహించి, మార్కుల రిపోర్టులను క్రమం తప్పకుండా సమర్పించాలని కలెక్టర్ విద్యాశాఖ అధికారులకు సూచించారు. అలాగే విద్యార్థులకు హెల్త్ చెకప్‌లు చేయించి, సంబంధిత సమాచారాన్ని పీఎం పోషన్ పర్ఫామెన్స్ పోర్టల్‌లో అప్డేట్ చేయాలని ఆదేశించారు. విద్యార్థులు, సిబ్బందికి సంబంధించిన ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్ మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ ఘని,మండల విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.




# ఓట్లు వేస్తామంటే మోదీ డ్యాన్స్ కూడా చేస్తారు

- ప్రధాని మోదీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డ రాహుల్ గాంధీ
- ఓట్ల కోసం మోదీ ఏమైనా చేస్తారని విమర్శ
- ఛఠ్ పూజ సమయంలో మోదీ స్విమ్మింగ్ పూల్‌లో స్నానం చేశారని ఆరోపణ
- పారిశ్రామికవేత్తల కోసమే మోదీ పనిచేస్తున్నారని ఫైర్
- దేశవ్యాప్తంగా కులగణన చేపడతామని హామీ
- బీహార్‌లో డబుల్ ఇంజన్ ప్రభుత్వాన్ని కూల్చాలని పిలుపు

**బీహార్, ప్రజాస్వరం**



బీహార్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రచార వేగాన్ని పెంచారు. బుధవారం నాడు ముజఫర్‌పూర్‌లోని సక్రా నియోజకవర్గంలో జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఎన్డీయే ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రధాని మోదీకి ప్రజల బాధల కన్నా ఓట్లే ముఖ్యమని ఆయన ఆరోపించారు. వర్షంలోనూ ప్రసంగాన్ని కొనసాగించిన రాహుల్ గాంధీ, "నరేంద్ర మోదీకి ఓట్లు తప్ప మరేదీ పట్టదు. మీరు ఓటు వేస్తామని చెప్పండి, ఆయన వేదికపై డ్యాన్స్ చేయమన్నా చేస్తారు. ఓట్లు పొందడానికి ఆయన ఏదైనా చేయగలరు" అని ఎద్దేవా చేశారు. రాజకీయ లబ్ధి కోసం ప్రధాని మోదీ మతపరమైన మనోభావాలను వాడుకుంటున్నారని రాహుల్ ఆరోపించారు. "ఛఠ్ పూజ సమయంలో ప్రజలు యమునా నదిలో స్నానాలు చేస్తూ పూజలు చేస్తుంటే, మోదీ మాత్రం తన కోసం ప్రత్యేకంగా నిర్మించుకున్న స్విమ్మింగ్ పూల్‌లో స్నానం చేశారు. దీన్నిబట్టి బీహార్ ప్రజల విశ్వాసాలతో ఆయనకు సంబంధం లేదని, కేవలం మీ ఓట్లు మాత్రమే కావాలని స్పష్టమవుతోంది" అని విమర్శించారు. ప్రధాని మోదీ పేదల కోసం కాకుండా పారిశ్రామికవేత్తల కోసమే పనిచేస్తున్నారని రాహుల్ గాంధీ ఆరోపించారు. "ఎన్నికల తర్వాత నరేంద్ర మోదీ రైతులు లేదా పేదలతో కనిపించరు. ఆయన చిన్న పరిశ్రమలను నాశనం చేసి, కేవలం పారిశ్రామికవేత్తలకే లబ్ధి చేకూరుస్తున్నారు. మా కల 'మేడ్ ఇన్ చైనా' కాదు, 'మేడ్ ఇన్ బీహార్' వస్తువులను చూడటం" అని అన్నారు.ఈ సభలో రాహుల్ గాంధీతో పాటు మహాకూటమి ముఖ్యమంత్రి అభ్యర్థి తేజస్వీ యాదవ్, వికాశ్‌శీల్ ఇన్సాన్ పార్టీ (వీఐపీ) అధినేత ముఖేశ్ సహానీ కూడా పాల్గొన్నారు. పేదలు, వెనుకబడిన వర్గాలను మోసం చేసిన ఎన్డీయే 'డబుల్ ఇంజన్ ప్రభుత్వాన్ని' కూకటివేళ్లతో పెకలించాలని వారు ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల బీహార్‌లో విద్య, ఉపాధి అవకాశాలు దెబ్బతిన్నాయని రాహుల్ అన్నారు. "బీహార్‌లో విద్యకు అర్థం లేకుండా పోయింది. పేపర్ లీక్‌లు కష్టపడి చదివిన యువత భవిష్యత్తును నాశనం చేశాయి. బీహారీలు అప్పులు చేసి విద్య, ఉద్యోగాల కోసం వలస వెళ్లాల్సి వస్తోంది. ఢిల్లీలోని ఎయిమ్స్ ఫ్లైఓవర్ కింద వారు బతుకు పోరాటం చేయడం మనం చూడవచ్చు," అని ఆవేదన వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి వస్తే దేశవ్యాప్తంగా కులగణన చేపట్టి, సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తామని హామీ ఇచ్చారు. "మేం కులగణన డిమాండ్ చేశాం, కానీ మోదీ, బీజేపీ మౌనంగా ఉన్నాయి. వారు సామాజిక న్యాయానికి వ్యతిరేకం. నితీశ్ కుమార్ పూర్తిగా బీజేపీ నియంత్రణలో ఉన్నారు. ఈ ప్రభుత్వాన్ని మార్చాల్సిన సమయం వచ్చింది. మేం ప్రతి కులానికి, ప్రతి మతానికి ప్రాతినిధ్యం వహించే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం. ఐదేళ్లలో బిహార్‌లో దేశంలోనే అత్యుత్తమ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేస్తాం" అని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు.

# 5&7 వార్డులలో ఉన్న పెద్ద గోర్జి మరియు పాత్రుని గోర్జి. సర్వే నంబర్ 47&164 గడ్డలు పూర్తిగా ఆక్రమణకు గురవడంతో నీరు పోయే మార్గం లేక పొంగు తున్న దృశ్యం

- విశాఖ జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు వాండ్రసి అప్పలరాజు

**మధురవాడ,అక్టోబర్ 29(ప్రజాస్వరం):**

విశాఖపట్నం మధురవాడ గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వర్షం నీరు వెళ్లడానికి సరైన మార్గం లేకపోవడంతో ఆ నీరు నగరంపాలెం పరిసర ప్రాంతాల్లోకి చొరబడి ముంపుకు గురవుతోందని విశాఖపట్నం జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు వాండ్రసి అప్పలరాజు అన్నారు. బుధవారం ముంపుకు గురైన ప్రాంతాల్లో ఆయన పరిశీలించి స్థానిక విలేకరులతో మాట్లాడారు ఈ ప్రాంతంలో వర్షపు నీరు అయోధ్య నగర్ పార్క్ హరిత ప్రాజెక్ట్ మీదగా ఎన్హెచ్ 16 కాలువల్లో కలిసి బంగాళాఖాతంలో కలవలసి ఉంది. కానీ సర్వే నంబరు 47తో పాటు కొన్ని గోర్జలు ఆక్రమణ గురి కావడంతో నీరంతా వెళ్లడానికి దారి లేక నగరంపాలెం పరిసర ప్రాంతాలలో కొన్ని లోతట్టు ప్రాంతాలు ముంపు గురవుతున్నాయి. ఈ విషయంపై గతంలో జీవీఎంసీ కమిషనర్ కు విన్నవించినా తగు చర్యలు తీసుకోకపోవడంతో నేడు కురుస్తున్న వర్షాలకు మొత్తం నీరంతా నగరంపాలెం గ్రామం తో పాటు పక్కనున్న లేఔట్ లోకు జొరబడి పోతుందని వాండ్రసి అప్పలరాజు ఆవేదన వ్యక్తం చేశారు ఇకనైనా దీనిపై జీవీఎంసీ అధికారులు తగు చర్యలు తీసుకొని ఆక్రమణలు తొలగించి రానున్న రోజుల్లోనైనా ప్రకృతి విపత్తుల నుండి ఈ ప్రాంతాలను రక్షించాలని వాండ్రసి అప్పలరాజు ఈ సందర్భంగా కోరారు.



# తెలంగాణ రాష్ట్ర ప్రొఫెషనల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా డా. జి. ఆదిత్య రెడ్డి.

**వనపర్తి,అక్టోబర్ 29(ప్రజాస్వరం):**



ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర స్థాయి అధ్యక్షుడిగా డా. జి. ఆదిత్య రెడ్డి నియమితులయ్యారు. బుధవారం పార్టీ జాతీయ అధ్యక్షుడు ప్రవీణ్ చక్రవర్తి ఈ నియామకాన్ని ప్రకటించారు. పార్టీ నేత ప్రవీణ్ చక్రవర్తి మాట్లాడుతూ, "వేర్వేరు రంగాల ప్రొఫెషనల్స్‌ను ఒకే చోటకు తేవడం ద్వారా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని బలపరిచాలి" అని చెప్పారు. డా.ఆదిత్య రెడ్డి మాట్లాడుతూ, "పార్టీ నా పై పెట్టిన నమ్మకాన్ని నిలబెట్టేందుకు అట్టడుగు స్థాయి నుంచి పనిచేస్తూ, ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ పార్టీని బలపరిచేందుకు కృషి చేస్తాను" అని పేర్కొన్నారు.




# జితేందర్ రెడ్డిని కలిసిన జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు రాజేంద్ర ప్రసాద్ యాదవ్

- శ్రీ రంగనాయకస్వామి దేవస్థానం అభివృద్ధికి నిధులు కోరుతూ వినతి

**వనపర్తి,అక్టోబర్ 29(ప్రజాస్వరం):**

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు ఏపీ జితేందర్ రెడ్డి ని వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ యాదవ్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు.ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ, శ్రీరంగాపురం మండల కేంద్రంలోని శ్రీ రంగనాయకస్వామి దేవస్థానం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించడం,, కేంద్ర పథకం ద్వారా నిధులు మంజూరు చేయించాలని కోరారు. దేవస్థానం ప్రాంత ప్రజల ఆకాంక్షలను ప్రభుత్వం గౌరవించి, ఆ ప్రాంతం పర్యాటక కేంద్రంగా రూపుదిద్దుకునేలా సహకరించాలని ఆయన అభిప్రాయపడ్డారు.ఈ సందర్భంగా ఎన్ ఎస్ యూ ఐ జిల్లా అధ్యక్షుడు రోహిత్,జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకుడు రవికుమార్ పాల్గొన్నారు.



# మొంథా తూఫాన్ పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- ముంపుకు గురి అయ్యే ప్రాంతాలను గుర్తించి,ఆయా ప్రాంతాల ప్రజలకు పునరావాస కేంద్రాల ఏర్పాటు చేయాలి
- అత్యవసర సమయాల్లో ఫిర్యాదు చేసేందుకు కలెక్టరేట్ లో 1077, 9063211298 టోల్ ఫ్రీ నెంబర్

**ఖమ్మం,అక్టోబర్ 29 (ప్రజాస్వరం):**





ఎగువ ప్రాంతాల నుండి వచ్చే వరదతో మున్నేరు వరద ప్రవాహం పెరుగుతున్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. మొంథా తూఫాను ప్రభావంతో మున్నేరు నది పరివాహక ప్రాంతాలలో ముందస్తు జాగ్రత్తల కోసం బుధవారం ఖమ్మం నగరంలోని కాల్వఒడ్డు, మున్నేరు ఘాట్, గణేష్ నిమజ్జన ఘాట్, బొక్కలగడ్డ, ఖమ్మం రూరల్ మండలంలోని జలగంనగర్, కేబీఆర్ నగర్, గ్రీన్ కాకతీయనగర్ తదితర ప్రాంతాలలో జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమీషనర్ అభిషేక్ ఆగస్త్య తో కలిసి పర్యటించారు. మున్నేరు బ్రిడ్జి వద్ద వరద ప్రవాహాన్ని, నీటిమట్టం స్థాయిని కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మున్నేరు పరిసర ప్రాంతాలు బొక్కలగడ్డలో స్థానిక ప్రజలతో కలెక్టర్ ముచ్చటిస్తూ, భారీ వర్షాలతో ఎగువ జిల్లాల నుండి మున్నేరు వరద పెరుగుతున్నందున అందరూ జాగ్రత్తగా ఉండాలని, అధికారులకు సహకరించాలని, వరద ఎప్పటికప్పుడు గమనించుకోవాలని సూచించారు. మున్నేరు వరద ముంపు ప్రాంతాల్లో నీటి మట్టం పెరుగుతున్న దృష్ట్యా అక్కడి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు, అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని సంబంధిత విభాగాల అధికారులు, సిబ్బంది సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ మొంథా తూఫాను ప్రభావంతో ఎగువ ప్రాంతంలో వర్షాలు కురుస్తుండటంతో మున్నేరుకి వరద ముప్పు పెరుగుతుందని, ప్రస్తుతం ఖమ్మం వద్ద మున్నేరు 17 అడుగుల మేర ప్రవహిస్తోందని మరో రెండు అడుగులు పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నామని తెలిపారు.అధికార యంత్రాంగం అంతా అప్రమత్తంగా ఉన్నామని, ఎలాంటి అత్యవసర పరిస్థితులు తలెత్తిన వెంటనే స్పందించేలా ఏర్పాట్లు చేశామని అన్నారు.ప్రజలు అనవసరంగా ముంపు ప్రాంతాల్లో తిరగవద్దని కోరారు.వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లాలోని అన్ని శాఖల అధికారులతో పూర్తి సంసిద్ధతతో స్థానికంగా ఉంటూ మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. నీటిపారుదల,రెవెన్యూ, పంచాయతీ,మున్సిపల్,పోలీస్ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు నీటిమట్టం అంచనా వేస్తూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.వరద పెరిగే అవకాశం ఉన్నందున మున్నేరు నది, బ్రిడ్జి ల పైకి ప్రజలు అనవసరంగా రావద్దని, ఎప్పటికప్పుడు లోతట్టు ప్రాంతాల ప్రజలందరూ జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంట ఏదులాపురం మున్సిపల్ కమీషనర్ శ్రీనివాస రెడ్డి,ఖమ్మం నగరపాలక సంస్థ సహాయ కమీషనర్ అనిల్ కుమార్,ఖమ్మం అర్బన్ మండల తహసీల్దార్ సైదులు,రూరల్ తహసీల్దార్ రాంప్రసాద్,మున్సిపల్, పోలీస్, ఇరిగేషన్ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# మద్యం సేవించి వాహనాల నడిపితే భారీ మూల్యం తప్పదు

- **ఎస్.ఐ. జి. అరుణ్ కుమార్**

**దౌల్తాబాద్, 29 అక్టోబర్ (ప్రజా స్వరం)**

దౌల్తాబాద్ ఎస్.ఐ. జి. అరుణ్ కుమార్ సందీప్తంగా ప్రజలకు ట్రాఫిక్ నియమాలను పాటించాలని ఆశపుంటూ మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు చేపట్టనున్నట్టు తెలిపారు. ప్రజల భద్రత కోసం తిరిగి నివేదికగా ఆయన పేర్కొన్నారు: మొదటి సారీ మద్యం సేవించి వాహనం నడిపితే రూ.10,000 జరిమానా లేదా ఆరు నెలల పాటు డ్రైవింగ్ లైసెన్స్ సస్పెండ్ చేయబడుతుంది.రెండో సారీ దాడి చేసినవారి కోసం రూ.15,000 జరిమానా విధించబడుతుంది.

**జరిమానా చెల్లించకపోతే చట్ట ప్రకారం జైలు శిక్ష అమలులోకి వస్తుంది.**

ఎస్.ఐ. అరుణ్ కుమార్ ప్రజలకు ఇచ్చిన ముఖ్య సూచనలు:1. ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం సేవించి వాహనం నడపవద్దు.2. మైనర్లువాహనాలు నడపనివ్వకూడదు తల్లిదండ్రులు వినియోగానికి అనుభవించ కూడదన్నారు

3. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండానేవాహనాలునడకండి.

4. నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాలను రోడ్డు మీద వెయ్యకండి.

5. సైలెన్సర్ మార్చి విద్యుత్ శబ్ధం లేదా అరుదైన మోడిఫికేషన్లతో వాహనాలు నడపవద్దు.

6. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నియమాలు, రోడ్డు చిహ్నాలు, వ్యక్తిగత భద్రత నియమాలు (హెల్మెట్, సీట్ బెల్ట్) తప్పనిసరిగా పాటించాలి. అనివార్య చర్యలు తీసుకోవడమో, కేసుల నమోదు చేసుకోవడమో జరుగుతాయని ఎస్.ఐ. తెలిపారు .ఇది రోడ్డు ప్రమాదాలు నివారించడమే లక్ష్యంగా ఉందని, ప్రతి పర్యవేక్షణ పోలీసులు నియమబద్ధంగా అమలు చేయబోతున్నారని ఆయన పేర్కొన్నారు.



# నిరుపేదలకు అఖిల రాజ్ అండ

**దౌల్తాబాద్ అక్టోబర్ 29 (ప్రజాస్వరం) :**

సేవా దృక్పథంలో భాగంగానే నిరుపేద కుటుంబాలకు అఖిల రాజ్ ఫౌండేషన్ అండగా నిలుస్తోందని ఫౌండేషన్ ప్రతినిధులు అన్నారు. మంగళవారం అక్బర్ పేట్ భూంపల్లి మండలం భూంపల్లి గ్రామానికి చెందిన బక్కి దుబ్బరాజం ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. విషయాన్ని తెలుసుకున్న ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కూకట్ పల్లి ఎస్ఐ తౌడ సత్యనారాయణ సౌజన్యంతో బాధిత కుటుంబానికి బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ వివిధ కారణాలతో అనారోగ్యంతో బాధపడుతున్న పేద కుటుంబాలకు ఫౌండేషన్ ఆదుకుంటుందన్నారు. విద్యా, ఉపాధి, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందన్నారు. ప్రజలు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కోరారు. మత్తు పదార్థాలకు అలవాటు పడి కుటుంబాలు ఆర్థికంగా చితికి పోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు వనం కనకయ్య, కమ్మరి శ్రీనివాస్, బండ చిన్న నర్సింలు, ఎడవేని లక్ష్మణ్, కంకణాల చంద్రం, బక్కి రామస్వామి, కరుణాకర్, మల్లేశం, ఏర్మని రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



# పాముకాటుకు గురై మరణించిన దయాకర్ కుటుంబానికి ఆర్థిక సహాయం

**దౌల్తాబాద్ అక్టోబర్ 29 (ప్రజాస్వరం):**

దౌల్తాబాద్ మండల పరిధిలోని తిరుమలపూర్ గ్రామానికి చెందిన యువరైతు దయాకర్ ఇటీవల తన వ్యవసాయ క్షేత్రంలో పనులు చేస్తున్న క్రమంలో పాము కాటుకు గురై చికిత్స పొందుతూ సిద్దిపేట ఏరియా ఆసుపత్రిలో మృతి చెందిన విషయం మనందరికీ తెలిసినదే కాదా ఇదే గ్రామానికి చెందిన సేవాసమితి వాట్సాప్ గ్రూప్ ఆధ్వర్యంలో సేకరించిన ఆర్థిక సహాయంబుధవారం అందచేయడం జరిగింది.

ఈ సంఘటన గ్రామస్తుల మధ్య దిగ్భ్రాంతి వ్యాపించింది, దయాకర్ కుటుంబం సహాయం కోసం గ్రామప్రజల నుండి పిలుపు పొందింది. తిరుమలపూర్ సేవాసమితి వాట్సాప్ గ్రూప్ సభ్యులు విభిన్న వర్గాల నుండి సేకరించిన డబ్బులను ఒకటిగా ఉంచి, ఆర్థిక సహాయం రూపంలో దయాకర్ కుటుంబానికి అందించారు.ఈ కార్యక్రమం ద్వారా కుటుంబానికి కొంత ఉపశమనం లభించటం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.సభ్యులందరి మద్దతు, సామాజిక దృక్పథం కవితారమైన ఈ కార్యక్రమం, సహకారాన్ని సంఘసేవను ప్రోత్సహించడం జరిగిందని పేర్కొన్నారు.ఈ మేరకు కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన గ్రామస్థులను కలిసి మరిన్ని సామాజిక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాలని తెలిపారు.

# గజ్వేల్లో బీసీ నేత ఎమ్మెల్యే కాకపోవడం దురదృష్టకరం

- **రాబోవు రోజులు బీసీ నాయకులదే రాజకీయం.**
- **టిఆర్పి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ హరి శంకర్ గౌడ్.**

**గజ్వేల్ అక్టోబర్ 29. (ప్రజాస్వరం) :**

గజ్వేల్ నియోజకవర్గం ఏర్పడిన నాటి నుండి నేటికి ఒక్క బీసీ నేత ఎమ్మెల్యే కాకపోవడం దురదృష్టకరం అని TRP రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ హరిశంకర్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు.సిద్దిపేట జిల్లా మర్కుక్ మండల కేంద్రంలో TRP పార్టీ జెండాను రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ హరీ శంకర్ గౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ కు గజ్వేల్, అల్లుడికి సిద్దిపేట, కొడుకు కేటీఆర్ కు సిరిసిల్ల నియోజకవర్గాలకు ఎమ్మెల్యేలను చేసుకున్నారు కేసీఆర్ అన్నారు.వారు పోటిల్లో ఉన్న ప్రాంతాల్లో బీసీలను పోటీ లేకుండా చేశారని ఆయన దుయ్యబట్టారు. TRP పార్టీకి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని,రాబోవు రోజుల్లో బీసీలదే రాజ్యాధికారం అని ఆయన ధీమావ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్చార్జి జ్యోతి, సిద్దిపేట జిల్లా ఇన్చార్జి బిక్షపతి గజ్వేల్ టిఆర్పి నాయకులు ఇంద్రా గౌడ్,నర్సింగ్, స్వామి తదితరులు పాల్గొన్నారు






# పశువులకు గాలికుంటు టీకా తప్పనిసరి :మద్దెల స్వామి

**దౌల్తాబాద్ అక్టోబర్ 29(ప్రజాస్వరం):**

మండల పరిధిలోని గొడుగుపల్లి గ్రామం లో పశువులకు గాలికుంటు (ఎఫ్.ఎమ్.డి) వ్యాధి నిరోధక టీకాలు వేయడం జరిగింది. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు మద్దెల స్వామి మాట్లాడుతూ పశువుల ఆరోగ్య రక్షణలో భాగంగా ప్రతి పశువుకూ తప్పనిసరిగా గాలికుంటు టీకాలు వేయించుకోవాలని రైతులకు సూచించారు. గాలికుంటు వ్యాధి పశువుల పాల ఉత్పత్తిని మెరుగు అవ్వడంతో పాటు మరణాలకు కూడా దారితీసే ప్రమాదం ఉన్నందున రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది శిల్పా,తాజామాజీ సర్పంచ్ శివకుమార్, మాజీ ఉప సర్పంచ్ బాబు,యూత్ కాంగ్రెస్ నాయకులు బాలశేఖర్ రెడ్డి తో పాటు దుర్గని నర్సింలు,నరేష్,రైతులు పాల్గొన్నారు.


# ఎంపీలకు ఆహ్వాన పత్రిక అందజేత





**వర్గల్ అక్టోబర్ 29 (ప్రజాస్వరం)**

వర్గల్ మండలం దండుపల్లి గ్రామంలోని శ్రీ పోచమ్మ ముత్యాలమ్మ దేవత మూర్తుల ప్రతిష్ట కార్యక్రమానికి మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు, మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ ను వర్గల్ మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో ఆహ్వానించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు శంకర్ గౌడ్, మండల ఉపాధ్యక్షులు యాదగిరి, నాయకులు జగన్,సంజీవులు మరియు దండుపల్లి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు



# తన్నీరు సత్యనారాయణ రావుకు నివాళులు అర్పించిన: బిఆర్ఎస్ నాయకులు

**శామీర్ పేట అక్టోబర్ 29(ప్రజస్వరం)**

మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు తండ్రి తన్నీరు సత్యనారాయణ రావు మంగళవారం మరణించడంతో బుధవారం శామీర్ పేట మండల బిఆర్ఎస్ మండల నాయకులు ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించి హరీష్ రావును పరామర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో శామీర్ పేట్ సొసైటీ వైస్ చైర్మన్ ఐలయ్య యాదవ్, మాజీ ఎంపిపి దాసరి ఎల్లుబాయి బాబు, జిల్లా నాయకులు శ్రీనివాస్ రెడ్డి, మాజీ వార్డు సభ్యులు డి. నవీన్ ముదిరాజ్, బిఆర్ఎస్ పార్టీ యూత్ నాయకుడు పవన్ ముదిరాజ్, నాయకులు బద్రీ ముదిరాజ్, చింటూ, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా సందర్శించిన సుడా చైర్మన్

- లెక్చరర్లకు తగు సూచనలు చేసి విద్యార్థినులకు భరోసా కల్పించారు

**కరీంనగర్,అక్టోబర్ 29 (ప్రజాస్వరం):**

గంగాధర మండలం కురిక్యాల ప్రభుత్వ పాఠశాలలో జరిగిన ఘటన దృష్ట్యా కరీం నగర్ లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను నేడు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఆకస్మికంగా సందర్శించి లెక్చరర్లకు సిబ్బందికి ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించి విద్యార్థినులకు భరోసా కల్పించారు.కళాశాలలో వసతుల పై ప్రిన్సిపాల్ ను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం విద్యకు వైద్యానికి ప్రాధాన్యత ఇస్తుందని సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.సాయంత్రం విద్యార్థినులు ఇంటికి వెళ్లే సమయంలో మెయిన్ గేటు వద్ద ఆకతాయిలు ఇబ్బంది పెడుతున్నారని విద్యార్థినులు సుడా చైర్మన్ దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే పోలీసు అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సాయంత్రం 4 గంటల నుండి 5 గంటల వరకు పోలీసులు మెయిన్ గేటు వద్ద పర్యవేక్షణ చేసి విద్యార్థినులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు.డిఈవో గంగాధర్,ప్రిన్సిపాల్ నిర్మల, సూపరింటెండెంట్ కిరణ్ కుమార్,లెక్చరర్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## వనపర్తిలో నూతన గృహప్రవేశ వేడుకలో ప్రజా వైద్యులు డాక్టర్ పగిడాల శ్రీనివాస్.

**వనపర్తి,అక్టోబర్ 29 (ప్రజాస్వరం):**

వనపర్తి జిల్లా కేంద్రంలోని కండక్టర్ కాలనీ రోడ్ నంబర్-1లో స్థానికులు శ్వేత నిరంజన్ గౌడ్ దంపతులు నిర్మించిన నూతన గృహంలో బుధవారం గృహప్రవేశ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రజా వైద్యులు డాక్టర్ పగిడాల శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై, సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంలో డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ "ఇంటి నిర్మాణం మన జీవితంలో ఎంతో పవిత్రమైన ఘట్టం. ఒక కుటుంబం కష్టపడి సొంత గృహాన్ని నిర్మించుకోవడం అనేది కేవలం భవన నిర్మాణం కాదు,అది కలల రూపకల్పన.ఈ ఇంటి ప్రాంగణం ఎల్లప్పుడూ నవ్వులు, ఆనందం, ప్రేమ,శాంతితో నిండిపోవాలి. సత్యనారాయణ స్వామి కటాక్షంతో ఈ కుటుంబానికి ఆరోగ్యం, ఆయుష్షు, ఐశ్వర్యం చేకూరాలని హృదయపూర్వకంగా కోరుకుంటున్నాను. సమాజం అభివృద్ధికి ప్రతి కుటుంబం ఇలాగే సుసంస్కృత వాతావరణంలో ముందుకు సాగాలని నా ఆకాంక్ష" అని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ ఘనీ, రాచాల యుగంధర్ గౌడ్,ఈనాడు పత్రిక రిపోర్టర్ అమరేందర్ గౌడ్,సాక్షి పత్రిక రిపోర్టర్ బోలెమోని రమేష్, తెలుగు ప్రభ రిపోర్టర్ ఖలీల్, బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు పాల్గొని గృహ యజమానులను అభినందించారు. వ్రతమంతా భక్తి శ్రద్ధలతో సాగగా, అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



# రాజ్యాంగాన్ని గౌరవించని వారు దేశద్రోహులు

- విశ్వాసాల ముసుగులో జస్టిస్ గవాయ్ పై దాడి దుర్మార్గపుచర్య
- సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ పై దాడి ఘటనను సుమోటోగా తీసుకోకపోవడం బాధాకరం
- దళితులు, న్యాయవ్యవస్థ, రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడానికి నవంబర్ 1న హైదరాబాదులో భారీ నిరసన ర్యాలీ
- విలేకరుల సమావేశంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ

**ఖమ్మం అక్టోబర్ 29(ప్రజాస్వరం):**

భారతదేశంలో రాజ్యాంగాన్ని గౌరవించని వారు చట్టాలకు విలువనివ్వని వారు దేశద్రోహులుగా పరిగణింపబడతారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ అన్నారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ దళితుల పై ఇప్పటికీ వివక్ష, అంటరానితనం, దాడులు, హత్యలు, హత్యాచారాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇవి నిత్యం సామాన్య ప్రజల మీద ఎక్కడో ఓ దిక్కు జరుగుతూనే ఉన్నాయన్నారు. మీడియా ద్వారా చూస్తూనే ఉన్నామన్నారు. దేశ అత్యున్నత వ్యవస్థ సుప్రీంకోర్టు. సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ దళితుడైన గవాయ్ మీదనే సుప్రీంకోర్టులో బూటుతో దాడి జరిగిందని ఆరోపించారు. ఆ సంఘటన దేశం, ప్రపంచంలోనే ప్రజలు నివ్వెరపోయారన్నారు. సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ మీద దాడి జరిగి మూడు వారాలు గడుస్తున్నప్పటికీ ఢిల్లీ పోలీసులు మౌనంగా ఉన్నారు. న్యాయవ్యవస్థ సుమోటోగా కేసు తీసుకోలేదు. మానవ హక్కుల కమిషన్ స్పందించలేదు. అంటే ఈ దేశంలో దళితులకు ఇప్పటికీ రక్షణ లేదని స్పష్టంగా రుజువు అవుతుందన్నారు. దాడి చేసిన వ్యక్తి, ఆ వ్యక్తిని సమర్థించే శక్తులు సోషల్ మీడియా ద్వారా, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా అభిప్రాయాలను చెబుతూనే.. మేము మళ్ళీమళ్ళీ దాడులు చేస్తామని చెబుతూనే ఉన్నారన్నారు. ధర్మం ముసుగులో, విశ్వాసాల ముసుగులో రాజ్యాంగాన్ని లెక్కచేయకుండా, చట్టాలకు విలువనివ్వకుండా దాడులు చేస్తామంటే వారు దేశ రాజ్యాంగాన్ని గౌరవించినట్లే చట్టాలకు విలువైనట్లే కదా అని భారత రాజ్యాంగాన్ని భారత పౌరులుగా మనమే అంగీకరించకపోతే, విలువనివ్వకపోతే ఇతర దేశస్థులు ఇస్తారా అంటూ.. మనం ఈ దేశభక్తులం ఎట్లా అవుతామని ప్రశ్నించారు. రాజ్యాంగాన్ని గౌరవించేవారు, మన చట్టాలకు విలువనిచ్చేవారు దేశభక్తులు అవుతారన్నారు. రాజ్యాంగాన్ని గౌరవించని వారు చట్టాలకు విలువనివ్వని వారు దేశద్రోహులవుతారని స్పష్టం చేశారు. రాజ్యాంగాన్ని గౌరవించేవారు చీఫ్ జస్టిస్ గవాయి పై దాడి చేయరన్నారు. దళితుడు జస్టిస్ గవాయ్ స్థానంలో వేరే జస్టిస్ ఉంటే దాడి జరిగేనా అని ప్రశ్నించారు.? గతంలో జార్ఖండ్ రాష్ట్రంలో న్యాయవాది, న్యాయమూర్తి మధ్యన జరిగిన చిన్నపాటి వాగ్వివాదం పై న్యాయమూర్తిని అవమానించాడని ఐదుగురు జడ్జిల బృందం అర్ధగంటలో న్యాయవాదిపై కేసునమోదు చేశారని గుర్తుచేశారు. అదేవిధంగా రౌడీషీటర్ రివాజ్ పై 40




కేసులు ఉన్నాయని, నిజాంబాద్ లో సంఘటన జరిగితే హైదరాబాద్ పోలీసు కస్టడీలో ఉన్న రివాజ్ ఎలా చనిపోతాడని మానవ హక్కుల కమిషన్ సుమోటోగా తీసుకొని కేసునమోదు చేసిందని గుర్తు చేశారు. దీనిని బట్టి చూస్తే చీఫ్ జస్టిస్ దళితుడి మీద సుప్రీంకోర్టులో దాడి జరిగితే సుమోటోగా కేసు ఎందుకు నమోదు చేయలేదని ప్రశ్నించారు. ఈ దేశంలో ఇంకా దళితులకు జరగాల్సిన న్యాయం జరగట్లేదని, దళితులు ఏ స్థాయికి ఎదిగినా కూడా అవమానాలు దాడులు, హత్యలు, జరుగుతున్నాయన్నారు. వారికి న్యాయం జరగట్లేదని స్పష్టం అవుతుందన్నారు. అధికారాలు ఉన్న పోలీసులు, మానవ హక్కుల కమిషన్, రాజ్యాంగ సంస్థలన్నీ ఎందుకు మౌనంగా ఉన్నాయని ప్రశ్నించారు..? దాడి చేసిన వారు స్వేచ్ఛగా ప్రెస్ మీట్లలో సోషల్ మీడియాలలో మాట్లాడుతూ మా విశ్వాసాల పరంగా దాడి చేశాం.. దానికి కట్టుబడి ఉన్నామని మాట్లాడుతున్నారని, ఎవరు విశ్వాసాలు వారి వ్యక్తిగతం. ఎవరి మతాలు వారు దేశంలో గౌరవించుకుంటున్నా..రాజ్యాంగాన్ని మాత్రం అందరూ గౌరవించాల్సిందేనని స్పష్టంచేశారు. విశ్వాసాల ముసుగులో దాడులు, హత్యలు చేస్తే రాజ్యాంగం.. చట్టాలు ఎందుకని నిలదీశారు..? అందుకే దళితుడైన చీఫ్ జస్టిస్ గవాయిపై సుప్రీంకోర్టులో జరిగిన దాడిని, దళితులందరిపై జరిగిన దాడిగా పరిగణిస్తూ.. దళితుల ఆత్మగౌరాన్ని కాపాడుకోవడానికి, న్యాయవ్యవస్థ గౌరవాన్ని నిలబెట్టడానికి, రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడానికి నవంబర్ 1న ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో దేశంలో ఎక్కడా జరగని నిరసన ర్యాలీ హైదరాబాదులో జరుగుతుందని, కుల, మత, రాజకీయాలకతీతంగా ప్రతి ఒక్కరు కదలి రావాలని పిలుపునిచ్చారు. ఈ మీడియా సమావేశంలో ఖమ్మం జిల్లా ఇంచార్జి కందికట్ల విజయ్ మాదిగ, మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధ్యక్షులు తూరుగంటి అంజయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు కూరపాటి సునీల్ మాదిగ, ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు చిలక నాగరాజు, గొల్లమండల ముత్తారావు, తోళ్ళ సురేష్, తూరుగంటి రాము, బాకీ శ్రీను, కనకం జనార్ధన్, చింతిరాల నాగభూషణం, కొలికపోగు ప్రభు, సూరేపల్లి నాగేశ్వరరావు, తోళ్ళ వెంకన్న, పొట్టపింజర బాలస్వామి, పార్షపు ఇనుక, పగిడిపల్లి రవీందర్, మాదాసు వెంకన్న, లంజపల్లి భద్రం, పడిశాల నాగేశ్వరరావు, కుక్కల లక్ష్మయ్య, చిర్రా ఉపేందర్, స్వామి, చాగంటి నరసింహారావు, రాజు, నాగేశ్వరావు, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహించిన బంగారుపాళ్యం పోలీసులు

- మానవత్వం చాటుకున్న ముస్లిం జేఏసీ కమిటీ,అధ్యక్షులు ఫిరోజ్ అహ్మద్ (అన్ను)

**బంగారుపాళ్యం,అక్టోబర్ 29(ప్రజాస్వరం):**

చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం బంగారు పాల్యం మండలంలో అక్టోబర్ 24వ తేదీ కరిడివారిపల్లి బ్రిడ్జి దగ్గర స్పృహ కోల్పోయి పడి ఉండడంతో స్థానిక బంగారు పాలెం పోలీస్ స్టేషన్ సిబ్బంది గమనించి 108 అంబులెన్స్ ద్వారా బంగారు పాలెం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. తదనంతరం 25వ తేదీ చనిపోవడం జరిగింది. ఐదు రోజులు కావస్తున్న వారికి సమీప బంధువులు ఎవరు రాకపోవడంతో బంగారు పాల్యం ముస్లిం



జేఏసీ నేతలు, పారిశుద్ధ్య కార్మికులు, పోలీస్ సిబ్బంది కలసి ఈ దినం మధ్యాహ్నం 2 గంటలకు అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో ముస్లిం జేఏసీ అధ్యక్షులు ఫిరోజ్ భాషా (అన్ను) వారి సిబ్బంది,బంగారు పాళ్యం పారిశుద్ధ్య కార్మికులు,పోలీస్ స్టేషన్ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ బాబు,కానిస్టేబుల్ ద్వారకనాథ్ తదితరులు పాల్గొన్నారు

## భారీ వర్షా లతో అప్రమత్తంగా ఉండండి

- ఎస్ఐ యుగేందర్ గౌడ్

**వలిగొండ,అక్టోబర్ 29(ప్రజాస్వరం):**

వలిగొండ మండల పరిధిలోని ప్రజలు భారీ వర్షాల కారణంగా అత్యవసరమైతే తప్ప ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరు బయటకు రాకూడదని ఎస్ఐ యుగంధర్ గౌడ్ మండల ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శిథిలవైన భవనాల్లో ఉండవద్దని విద్యుత్ వైర్లు ట్రాన్స్ఫార్మర్లు మోటర్లు స్తంభాలను తాకవద్దని ప్రజలకు రైతులకు సూచించారు వర్షాల ప్రభావంతో చెరువులు కుంటలు లోతాట్టు ప్రాంతాలు జరమయమయ్యే అవకాశం ఉన్నందున చిన్నారులను వృద్ధులను ఒంటరిగా బయటకు పంపించవద్దు అని అన్నారు. వర్షాలతో చెరువులు



కుంటలు నిండి ప్రవహిస్తున్నందున ప్రజలందరూ పోలీసు వారి సూచనలతో తమ కుటుంబాల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు.వర్షపు రోడ్లపై వేగంగా డ్రైవ్ చేయవద్దని,అత్యవసర సందర్భాల్లో 100/112 కి కాల్ చేయాలని ఎస్ఐ యుగేందర్ గౌడ్ తెలిపారు.

## వరి కొనుగోలు కేంద్రాలను రెండు రోజుల్లో ప్రారంభించాలి

- బాల్య వివాహాలు అరికట్టేందుకు నవంబర్ 14న మహిళా సంఘాలతో మండలస్థాయి ప్రత్యేక అవగాహన సదస్సు ఏర్పాటు చేయాలి.
- ప్రతి మండలంలో మహిళా సంఘాల సభ్యులకు ఒక స్వయం ఉపాధి యూనిట్ నెలకొల్పేందుకు ఎ.పి.యం లు బాధ్యత తీసుకోవాలి.
- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి,అక్టోబర్ 29 (ప్రజాస్వరం):**

జిల్లాలో వరి కోతలు ప్రారంభమయ్యాయి కాబట్టి ఐ. కె పి సభ్యులకు కేటాయించిన అన్ని కొనుగోలు కేంద్రాలను రెండ్రోజుల్లో ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఐ. కె.పి. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేందుకు అవసరమైన తూకం యంత్రాలు తేమ కొలిచే యంత్రాలు, టార్పాలిన్ లు తదితర పరికరాలను మార్కెటింగ్ శాఖ నుండి తీసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రంలో ఇప్పటికే శిక్షణ పొందిన సిబ్బంది ఖచ్చితంగా ఉండాలని అలా కాకుండా శిక్షణ పొందని వ్యక్తిని పెట్టి కొనుగోలు చేస్తే సంబంధిత ఎ .పి.యం పైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ధాన్యం సేకరణ విషయంలో రాజీ పడవద్దని, నియమ నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని సేకరించాలని, అందుకు రైతులకు సైతం తేమ, తాలు విషయంలో అవగాహన కల్పించాలని సూచించారు.

జిల్లాలో బాల్య వివాహాలు జరగకుండా అరికట్టడానికి నవంబర్ 14న అన్ని మండల కేంద్రాల్లో మహిళా సంఘాల సభ్యులతో, గ్రామ పెద్దలు, కుల పెద్దలతో అవగాహన కార్యక్రమం చేపట్టాలని, బాల్య వివాహం వల్ల జరిగే అనర్థాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఎక్కడైనా బాల్య వివాహం జరిగే అవకాశం ఉంటే వెంటనే 1098 టోల్ ఫ్రీ నెంబరు కు సమాచారం ఇచ్చే విధంగా అవగాహన కల్పించాలన్నారు. విద్యాలయాల నుండి మధ్యలోనే చదువు మానేసిన అమ్మాయిల జాబితా ఇవ్వడం జరిగిందని, జాబితా ప్రకారం ఇళ్లకు వెళ్ళి అమ్మాయి, వారి తల్లిదండ్రులతో మాట్లాడి తిరిగి విద్యాలయాల్లో చేర్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎ.పి.యం లను ఆదేశించారు మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు ప్రతి మండలం నుండి స్వయం సహాయక సభ్యులకు కనీసం ఒక యూనిట్ నెలకొల్పే విధంగా ఎ.పి.యం లు బాధ్యత తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా జిల్లాలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇళ్లు కట్టుకోడానికి మహిళా సంఘాల ద్వారా రుణాలు మంజూరు చేయించాలని తద్వారా వారు అధిక వడ్డీకి రుణాలు తీసుకోకుండా తక్కువ వడ్డీతో బ్యాంకు రుణాలు పొంది ఇల్లు నిర్మించుకుంటారని తెలియజేశారు. ఎక్కడైనా బ్యాంకర్లతో సమస్యలు ఉంటే సంప్రదింపుల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు.పి.డి. డిఆర్డిఓ ఉమాదేవి లీడ్ బ్యాంకు మేనేజర్ శివకుమార్ సహాయ లీడ్ బ్యాంక్ మేనేజర్ సాయి,డి.పి.యం లో,ఎ పి యం లు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌బీ నగర్‌లో విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన




**ఎల్‌బీ నగర్,అక్టోబర్ 29(ప్రజాస్వరం):**

ఎల్‌బీ నగర్ రాక్ టౌన్ కాలనీలోని కంగారూ కిడ్స్ స్కూల్ విద్యార్థులు బుధవారం ఎల్‌బీ నగర్‌లోని ట్రాఫిక్ చిల్డ్రన్ పార్క్ సందర్శించారు. ఈ కార్యక్రమాన్ని ట్రాఫిక్ పోలీసులు విద్యార్థుల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంచేందుకు ప్రత్యేకంగా నిర్వహించారు.పార్క్‌లో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్, జీబ్రా క్రాసింగ్స్, ట్రాఫిక్ బోర్డులు చూసి విద్యార్థులు ఆనందపడ్డారు. పోలీసులు వారికి రోడ్డు దాటేటప్పుడు పాటించాల్సిన జాగ్రత్తలు, వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ ఉపయోగం వంటి విషయాలను వివరిస్తూ ప్రాక్టికల్ డెమోన్స్ట్రేషన్ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మొత్తం 33 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. చిన్నప్పటి నుంచే ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంపొందితే భవిష్యత్తులో రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయని రాచకొండ పోలీసు అధికారులు పేర్కొన్నారు. పిల్లల ఉత్సాహాన్ని చూసి ఉపాధ్యాయులు ,తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

## జిల్లాలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించాలి

- మొక్కజొన్న పండించిన రైతులు దళారులకు తక్కువ ధరకు కాకుండా ప్రభుత్వ మద్దతు ధరకు అమ్ముకోవాలి
- అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎన్ ఖీమ్య నాయక్

**వనపర్తి,అక్టోబర్ 29 (ప్రజాస్వరం):**

వనపర్తి జిల్లాలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించాలని అదనపు కలెక్టర్ ఎన్. ఖీమ్యా నాయక్ బుధవారం మార్క్ ఫెడ్ అధికారిని ఆదేశించారు. వనపర్తి జిల్లాలో 10958 ఎకరాలలో రైతులు మొక్కజొన్న పంట సాగు చేయడం జరిగిందని, ఇప్పటికే మొక్కజొన్న హార్వెస్టింగ్ ప్రారంభమైనందున రైతులకు ఇబ్బందులు కాకుండా వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం క్వింటాలుకు రూ.2400 మద్దతు ధర ప్రకటించిందని, మద్దతు ధరకు ఏమాత్రం తగ్గకుండా రైతులు తమ పంటను లాభసాటిగా అమ్ముకోవాలని సూచించారు. జిల్లాలో సహకార సంఘాల ద్వారా చిట్యాల, గోపాల్పేట, చిన్నంబావి లలో ఒక్కొక్కటి చొప్పున (3) మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. మొక్కజొన్న తేమ 14 శాతానికి మించకుండ కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. వనపర్తి జిల్లాలో 10958 ఎకరాల్లో మొక్క జొన్న పంట సాగు చేయగా దాదాపు 2,73,800 క్వింటాళ్ల దిగుబడి అయి కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. అత్యధికంగా చిన్నంబావి మండలంలో 7492 ఎకరాల్లో మొక్క




జొన్న పంట సాగు చేయడం జరిగిందన్నారు. పంట అమ్మడంలో ఏమైనా ఇబ్బందులు ఏర్పడితే మార్క్ ఫెడ్ అధికారి చంద్రమౌళి కాంటాక్ట్ నెంబర్ 9989804756 కు సంప్రదించాలని సూచించారు.జిల్లా వ్యవసాయ అధికారి ఆంజనేయులు,మార్క్ ఫెడ్ అధికారి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

## ఒకే ఇంట్లో రెండుసార్లు దొంగ సుమారు 12 లక్షల రూపాయలు విలువగల బంగారం స్వాధీనం చేసుకున్న పోలీసులు

- **ఏసిపి విజయ్ కుమార్ కరీంనగర్ రూరల్ సబ్ డివిజన్.**

**కరీంనగర్,అక్టోబర్ 29 (ప్రజాస్వరం):**

తీగలగుట్టపల్లి లోని రెవెన్యూ కాలనీలో ఈ సంవత్సరం ఫిబ్రవరి జూన్ నెలలలో ఒకే ఇంటిలో రెండుసార్లు దొంగతనం జరగగా కరీంనగర్ రూరల్ పిఎస్ లో కేసు నమోదు అయినది కాగా కరీంనగర్ సిపి శ్రీ గౌష్ ఆలం ఐపీఎస్ ఆదేశాల మేరకు కరీంనగర్ రూరల్ ఏసిపి విజయ్ కుమార్ అట్టి దొంగతనంలను చేదించుటకై కరీంనగర్ రూరల్ సిఐ ఏ.నిరంజన్ రెడ్డి, సిసిఎస్ సిఐ ప్రకాష్ గౌడ్ లకు అప్పగించగా ఈ కేసును ఛేదించారు, తీగలగుట్టపల్లి లోని రెవెన్యూ కాలనీకి చెందిన మహమ్మద్ ముస్తాక్ తండ్రి అక్బర్ అనునతడు ఆన్లైన్ బెట్టింగ్ గేమ్ డాష్ రమ్మీ అను అప్లికేషన్ను తన ఫోన్లో డౌన్లోడ్ చేసుకుని గత రెండు సంవత్సరాల నుండి ఆడుతూ అట్టి ఆటకు అలవాటు పడి లక్షల్లో నష్టపోయి అప్పులల్లో కూరుకుపోయి వాటిని తీర్చుటకు దొంగగా మారినాడు. వివరాల్లోకి వెళితే మహమ్మద్ ముస్తాక్ గత సంవత్సరంన్నర నుండి కోదాడ దగ్గరలోని మేళ్లచెరువు వద్ద బాయిలర్ ఆపరేటర్ గా పని చేస్తున్నాడు ఆన్లైన్ బెట్టింగ్ గేమ్ డాష్ రమ్మీ ఆడుటకు అలవాటు పడి తన తల్లిదండ్రులకు తెలియకుండా తన స్నేహితులు మరియు తెలిసిన వారి వద్ద డబ్బులు అప్పు చేసి డాష్ రమ్మి అను ఆన్లైన్ బెట్టింగ్ యాప్ దానిలో ఆడి పోగొట్టుకొని తిరిగి చెల్లించలేక దొంగగా మారాడు ఇందుకోసం ఇదే సంవత్సరం ఫిబ్రవరి జూన్ నెలలో తాళం వేసి ఉన్న ఇండ్లను గుర్తించి తీగల గుట్టపల్లి లోని ఒకే ఇంట్లో రెండుసార్లు కిటికీ యొక్క గ్రిల్ తొలగించి ఇంట్లోకి చొరబడి బంగారం మరియు నగదును దొంగతనం చేసినాడు జూబ్లీ నగర్ లోని దర్గా సమీపంలో గల ఒక ఇంట్లోకి చొరబడి టీవీని దొంగలించినాడు. బంగారం ఇక్కడ ఎవరూ కొనక పోవడంతో కోదాడ వెళ్లి అక్కడ అమ్మడానికి ప్రయత్నించాడు అక్కడ కూడా ఎవరూ కొననందున తిరిగి తీగలు గుట్టపల్లి కి వచ్చి కరీంనగర్ లో గాని వరంగల్ లో గాని మంచిర్యాలలో గాని అమ్ముదామని నిర్ణయించుకొని ఈరోజున తీగల గుట్టపల్లి లోని రైల్వే స్టేషన్ కు వచ్చి బయట నిలబడి ఉండగా పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించుచుండగా కరీంనగర్ రూరల్ సీఐ ఏ నిరంజన్ రెడ్డి మరియు సిబ్బంది పట్టుకొని అతని వద్ద దొంగలించబడిన సొమ్ము సుమారు 91 గ్రాముల బంగారం, 5 వేల రూపాయల నగదు మరియు ఒక సెల్ ఫోను పోలీసులు స్వాధీనపరచుకొని పిఎస్ కు తిరిగి వచ్చి తదుపరి చర్య నిమిత్తం రిమాండ్ కు తరలించనైనది, ఇట్టి దొంగతనంలో కేసుల్లోని నేరస్తుడైన మహమ్మద్ ముస్తాక్ ను పట్టుకున్న కరీంనగర్ రూరల్ సీఐ ఏ.నిరంజన్ రెడ్డి సిసిఎస్ సిఐ ప్రకాష్ గౌడ్ ను ఎస్సై లక్ష్మారెడ్డి, సిసిఎస్ హెచ్ సి ఎండి హసనోద్దీన్ పిసి ఎన్. శేఖర్ పిసి ఎండి ఖలీఫా రూరల్ హెచ్సి శ్రీరాములు పిసి సల్మాన్ లను సిపి గౌష్ ఆలం ఐపిఎస్ ఏసిపి విజయ్ కుమార్ లు అభినందించినారు మరియు సిబ్బందికి నగదు రివార్డును అందజేయనైనది






## డాక్టర్ జిల్లెల ఆదిత్యరెడ్డికి ఘన సన్మానం

**వనపర్తి ప్రతినిధి,అక్టోబర్ 29(ప్రజాస్వరం):**

ఆల్ ఇండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులుగా నియమితులైన డాక్టర్ జిల్లెల ఆదిత్య రెడ్డికి పలువురు ఘన సన్మానం చేశారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన వనపర్తి జిల్లా వికలాంగుల కమిటీ అధ్యక్షులు గంజాయి రమేష్, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ దేవన్న యాదవ్, మున్నూరు జయకర్, యాదగిరి, అజీమ్ తదితరులు బుధవారం హైదరాబాద్ లోని మంత్రుల నివాస సముదాయంలో ఆదిత్య రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.

# కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి అధిక మొత్తంలో కేంద్ర నిధులు

- **15వేల మంది విద్యార్థులకు ఉచిత సైకిళ్లు.**
- **అంగన్వాడీ టీచర్లకు ఉచితంగా ట్యాబ్స్.**
- **కేంద్ర పథకాల నిధులను ఇతర కార్యక్రమాలకు మళ్లించవద్దు.**
- **ప్రభుత్వాసుపత్రుల్లో మందులకు నిధులు ఇస్తాం.**
- **పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనులు.**
- **మంజూరైన పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి.**
- **కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, దిశ కమిటీ చైర్మన్ బండి సంజయ్ కుమార్.**




**కరీంనగర్,అక్టోబర్ 29 (ప్రజాస్వరం):**

పార్టీలకు అతీతంగా అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, రాష్ట్రంలో అత్యధికంగా కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గానికి కేంద్ర నిధులు తీసుకువచ్చామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, జిల్లా అభివృద్ధి, కోఆర్డినేషన్& మానిటరింగ్ కమిటీ (దిశ) చైర్మన్ బండి సంజయ్ కుమార్ అన్నారు. కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో బుధవారం కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల అభివృద్ధి, కోఆర్డినేషన్&మానిటరింగ్ కమిటీ (దిశ)సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కమిటీ చైర్మన్, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గం అభివృద్ధికి ఎన్నో నిధులు మంజూరు చేయించి పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నామని అన్నారు. ఏ పార్టీకి చెందిన వారైనా నియోజకవర్గ అభివృద్ధికి సలహాలు, సూచనలు ఇవ్వవచ్చని తెలిపారు. రాష్ట్రంలో గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ నిధులే కారణమని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతోనే అభివృద్ధి సాధ్యమని వెల్లడించారు. 851 కోట్ల రూపాయల ఎంపీ నిధులను కరీంనగర్ అభివృద్ధికి కేటాయించామని అన్నారు. ప్రభుత్వాసుపత్రిలో ఆధునిక సౌకర్యాలు కల్పించాలన్న ఉద్దేశంతో హుజురాబాద్ హుస్నాబాద్ జమ్మికుంట సిరిసిల్ల ఆసుపత్రులకు అవసరమైన పరికరాలు ఏర్పాటు చేయిస్తున్నామని, అందుకు తగిన విధంగా సిబ్బందిని వైద్యులను నియమించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు 15వేల సైకిళ్లు ఉచితంగా అందజేశామని మరో 5 వేల సైకిల్ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాప్ అవుట్స్ తగ్గాయని అన్నారు. పీఎం శ్రీ నిధులను ఇతర కార్యక్రమాలకు మళ్ళిస్తే కఠిన చర్యలు ఉంటాయని అధికారులను హెచ్చరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో టాయిలెట్స్, మౌలిక సదుపాయాలు అవసరమైతే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎంపీ నిధుల ద్వారా మంజూరైన పనులన్నింటినీ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అన్నారు. గన్నేరువరం బ్రిడ్జి, కేంద్రం సేతు బంధన్ పథకం ద్వారా మంజూరు చేసిన కరీంనగర్ ఆర్ఓబి నిర్మాణం తదితర పనులన్నీ వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. రానున్న నాలుగు సంవత్సరాల కాలానికి సరిపడా మందుల ఇండెంట్ తనకు సమర్పించాలని, నిధులు సమకూరుస్తానని వెల్లడించారు. ఆయుష్మాన్ భారత్ రిజిస్ట్రేషన్లు త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. కరీంనగర్ సిరిసిల్ల జిల్లాలోని అంగన్వాడీ టీచర్లకు రోజువారి నివేదికల సమర్పించేందుకు ఉచితంగా ట్యాబ్ అందజేస్తామని తెలిపారు. సోలార్ పవర్ వినియోగం పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ పథకాలను గురించి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని అన్నారు. ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ మల్కా కొమరయ్య మాట్లాడుతూ పాఠశాలల్లో మరుగుదొడ్లు, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. తన క్షేత్రస్థాయి పర్యటనలో అనేక పాఠశాలల్లో కనీస సౌకర్యాలు లేవని వెల్లడించారు. కస్తూరిబా పాఠశాలల్లో సిబ్బంది వేతనాలు పెంచాలని, మోడల్ స్కూల్ సిబ్బందికి ప్రతినెలా క్రమం తప్పకుండా వేతనాలు చెల్లించాలని సూచించారు. మధ్యలో చదువు ఆపేసిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి వారిని తిరిగి పాఠశాలలో చేర్పించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని అన్నారు. విద్య, వైద్యం తదితర రంగాల్లో కేంద్రం అనేక నిధులు వెచ్చించి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని అన్నారు. ప్రజలు ఈ పథకాలను సద్వినియోగం చేసుకునేలా వారికి గ్రామస్థాయిలో అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారుల్లో ఉందని అన్నారు.ఈ సమావేశంలో కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి,సిరిసిల్ల ఇన్చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్, అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే,లక్ష్మి కిరణ్,మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ తదితరులు పాల్గొన్నారు.







## గోపరాజు పల్లి లో తడిసిన ధాన్యం పట్టించుకోని అధికారులు

**వలిగొండ,అక్టోబర్ 29(ప్రజాస్వరం):**

లిగొండ మండల పరిధిలోని గోపరాజుపల్లి వ్యవసాయ మార్కెట్లో రైతులు వరి ధాన్యాన్ని మార్కెట్లో పోసి నెల రోజులు కావస్తున్నప్పటికీ నేటివరకు ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో భారీ వర్షాల నేపథ్యంలో ధాన్యం మొత్తం తడిసిముద్దయిరైతన్నలుబుధవారంభారీవర్షం వస్తున్నప్పటికీ మార్కెట్లో తడిసిన ధాన్యాన్ని చూస్తూ లబోదిబోమంటూ కన్నీరు పెట్టారు .ప్రభుత్వం వెంటనే తడిసిన ధాన్యాన్ని వెంటనే వేగవంతంగా కొనుగోలు ప్రారంభించాలని రైతులు కోరారు.అధికారులు పట్టించుకోక ధాన్యం తడిసిపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు అకాల వర్షానికి ధాన్యం మొత్తం కుప్పలు పూర్తిగా తడిసిపోయాయి. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి కనుగొళ్లను వేగవంతం చేయాలని రైతుల కోరుతున్నారు .ధాన్యం తరిసిపోవడంతో రైతులు తల్లడిలిపోయారు రోజులు గడుస్తున్న పట్టించుకునే అధికారులే లేరంటూ అన్నదాతలు వాపోతున్నారు. ప్రభుత్వం నమ్ముకొని వచ్చిన అన్నదాతలను కష్టాలు తప్పడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.గోపరాజుపల్లి అన్నదాతలు వేగంగా కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని అన్నారు.



## రిజర్వేషన్లు సాధించేవరకు పోరాటం




**షాబాద్,అక్టోబర్ 29 (ప్రజాస్వరం):**

42 శాతం బిసి రిజర్వేషన్లు సాధించేవరకు పోరాటం ఆగదు అని బిసి రిజర్వేషన్ల సాధన సమితి నాయకులు అన్నారు.గురువారం 18 వ రోజుకు చేరుకున్న రిలే నిరాహార దీక్షలో భాగంగా పద్మశాలి సంఘం నాయకులు ఏశాల చంద్రశేఖర్ పద్మశాలి, భాస నర్సింలు పద్మశాలి,ఏశాల మధుసూదన్ పద్మశాలి, డాక్టర్ రాజు పద్మశాలి మద్దతు తెలుపుతూ నిరాహార దీక్ష చేపట్టారు.ఈ సందర్భంగా ఏశాల చంద్రశేఖర్ పద్మశాలి,ఏశాల మధుసూదన్ పద్మశాలి,భాస నర్సింలు పద్మశాలి మాట్లాడుతూ జనాభాలో అధిక శాతంలో ఉన్న బిసి లు అణిచివేతకు గురవుతున్నారని 42 శాతం రిజర్వేషన్లు కల్పించి స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రాతినిధ్యం వహించే అవకాశాలు కల్పించాలని, ప్రతి బిసి నాయకులు రాజకీయంగా రాణించాలని అన్నారు.42 శాతం రిజర్వేషన్లు న్యాయమైన పోరాటమే అని అన్నారు.ఈ కార్యక్రమంలో బిసి రిజర్వేషన్ల సాధన సమితి నాయకులు జెడల రాజేందర్ గౌడ్, తమ్మలి రవీందర్, నక్క శ్రీనివాస్ గౌడ్,రమేష్ యాదవ్, రాపోలు నర్సింలు ,పద్మశాలి సంఘం నాయకులు కృష్ణ,సతీష్, భాస వేణు,బాస కరుణాకర్,సత్యనారాయణ, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షాల కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- **తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలా సహాయక చర్యలకు సిద్ధంగా ఉంది**
- **లోతట్టు ప్రాంత ప్రజలకు కాంగ్రెస్ శ్రేణులు అందుబాటులో ఉండాలి**
- **చేవెళ్ళ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి భీమ్ భరత్**

**రంగారెడ్డి ప్రతినిధి అక్టోబర్ 29(ప్రజాస్వరం):**

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర తుపాను మొంథా తీరం దాటన కారణంగా ఉత్తర వాయువ్యం దిశగా తెలంగాణపై ప్రభావం చూపనుందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చేవెళ్ళ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పామేన భీమ్ భరత్ అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ భారీ వర్షం, ఈదురు గాలులు ఉన్నందున్న రంగారెడ్డి జిల్లా చేవెళ్ళ నియోజకవర్గం ప్రజలు అప్రమత్తంగా ఉంది తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రెడ్ అలర్ట్ జారీ చేసిన జిల్లాల్లో విద్యాసంస్థలకు సెలవు, బస్సులు, రైళ్లు రద్దు చేశారని తెలిపారు. తుఫాన్ కారణంగా ఏర్పడే ఇబ్బందులను పరిష్కరించేందుకు తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలా సహాయక చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉందని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. అవసరమైతేనే ప్రజలు బయటకు రావాలని లోతట్టు ప్రాంత ప్రజలకు కాంగ్రెస్ శ్రేణులు అందుబాటులో ఉండాలని కోరారు. విద్యుత్, మున్సిపల్, పోలీస్ సహా ఇతర విభాగాల అధికారులతో ఆయన మాట్లాడి మొంథా గండం గట్టెక్కే వరకు సిబ్బందిని అందుబాటులో ఉంచాలని కోరినట్లు పేర్కొన్నారు. ఆంధ్రాకు వెళ్లే వారు ప్రయాణాలు వాయిదా వేసుకోవాలన్నారు. రైతులు సైతం విద్యుత్ శాఖ అధికారుల సూచనలు పాటించాలని భీమ్ భరత్ విజ్ఞప్తి చేశారు.

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో డెంగ్యూ పరీక్షలు కొనసాగించాలి

- **జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి.**

**వనపర్తి ప్రతినిధి,అక్టోబర్ 29(ప్రజాస్వరం):**



జిల్లాలో వర్షాల ప్రభావం ఇంకా కొనసాగుతున్న నేపథ్యంలో ఆస్పత్రికి వచ్చే రోగులకు డెంగ్యూ పరీక్షలు కొనసాగించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం గోపాల్పేట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించి, అటెండెన్స్ వివరాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. జిల్లాలో వర్షాల ప్రభావం ఇంకా కొనసాగుతున్న నేపథ్యంలో ఆస్పత్రికి వచ్చే రోగులకు డెంగ్యూ పరీక్షలు కొనసాగించాలని ఆదేశించారు. అదేవిధంగా మలేరియా, డెంగ్యూ కు సంబంధించిన మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో రూపొందించిన హెల్త్ యాప్ లో టీబీ స్క్రీనింగ్, డయాబెటిస్ స్క్రీనింగ్ కు సంబంధించిన రిపోర్టులను అప్లోడ్ చేయాలని ఈ విషయంలో అలసత్వం ప్రదర్శించవద్దని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శ్రీనివాసులు, ప్రోగ్రామ్ ఆఫీసర్ సాయినాథ్ రెడ్డి, వైద్యాధికారులు పరిమళ ఇతర అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR : PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999